క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని తాళ్ల రేవు బైపాస్ కేశవస్వామి కాలనీ జంక్షన్ వద్ద మోటార్ సైకిల్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఒక యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కాజులూరు మండలం గొల్లపాలెం గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్ యానాం వెళ్లి తిరిగి వస్తూ ప్రమాదానికి గురయ్యాడు. తీవ్ర గాయాలపాలైన దుర్గా ప్రసాద్‌ను స్థానికులు హుటాహుటీన 108 వాహనంలో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కాట్రేనికోన: ఇటీవల పాము కాటుతో మృతి చెందిన గెద్దనపల్లి పంచాయతీ బక్కివారిపేటకు చెందిన మాదే చినసత్యనారాయణ కుటుంబానికి అతడి చిన్ననాటి మిత్రులు రూ.20 వేల ఆర్థిక సాయాన్ని బుధవారం అందజేశారు. 1994–95లో సత్యనారాయణతో కలిసి పదో తరగతి చదువుకున్న మిత్రులంతా బుధవారం ఆయన కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మట్టా సత్తిబాబు, గెద్దాడ శ్రీను, నక్కా శ్రీను, కోండ్రు శ్రీను, పిల్లి వెంకటరమణ పాల్గొన్నారు.

8న యోగా ఇన్‌స్ట్రక్టర్లకు ఇంటర్వ్యూలు

యానాం: యానాం రీజినల్ హెల్త్ సొసైటీ, స్టేట్ హెల్త్ సొసైటీ ఆధ్వర్యంలో రెండు యోగా ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు మిషన్ డైరెక్టర్ డాక్టర్ జి.శ్రీరాములు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 8న ఉదయం 9 గంటలకు నిర్వహించే వాక్‌ఇన్ ఇంటర్వ్యూలకు సంబంధించి పోస్టులు, వయసు, రెమ్యునరేషన్ తదితర వివరాలను health.py.gov.in వెబ్‌సైట్‌లో చూడొచ్చన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి కంప్యూటర్ల బహూకరణ



తహసీల్దార్ సాంబశివప్రసాద్‌కు కంప్యూటర్లను అందజేస్తున్న ఎంపీ అనురాధ

అల్లవరం: ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ నిధులు రూ.4 లక్షలతో సమకూర్చిన కంప్యూటర్ పరికరాలను తహసీల్దార్ సాంబశివప్రసాద్‌కు ఎంపీ అనురాధ మొగళ్ళమూరులోని ఎంపీ కార్యాలయంలో బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లాడి ఉమామహేశ్వరరావు, కొనుకు మహేష్, దుర్గా శ్రీనివాస్ పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి

అమలాపురం రూరల్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఆగస్టు రెండో వారంలో చేపట్టిన ఛలో హైదరాబాద్ విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జి వల్లూరు సత్తిబాబు పిలుపునిచ్చారు. జిల్లా ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ, ఎంఈఎఫ్ అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం రోళ్లపాలెంలోని నేదునూరి నతానిమేలు స్వగృహం వద్ద నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సవరపు భైరవమూర్తి, జిల్లా ఇన్‌చార్జ్ వల్లూరు సత్తిబాబు,యార్లగడ్డ సత్తిబాబు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ సాయిబాబుకు సత్కారం

అల్లవరం: గోడి బాలుర గురుకులంలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్లిన ప్రిన్సిపాల్ నెల్లి సాయిబాబు దంపతులను సర్పంచ్ తోట శ్రీదేవి దంపతుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ శ్యామ్‌ప్రసాద్, రేవు శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ మహ్మద్ జాని పాల్గొన్నారు.

రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను అక్కడే కొనసాగించాలి

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 22 ఏళ్ల క్రితం ఏర్పాటుచేసిన రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను అక్కడే కొనసాగించేందుకు మున్సిపాలిటీ సహకరించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు కోరారు. అమలాపురంలోని ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు క్యాంపు కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోనసీమకు రైల్వేలైన్ వచ్చేవరకైనా ఈ కౌంటర్‌ను మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోనే అద్దె లేకుండా కొనసాగించాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి అయితాబత్తుల సుభాషిణి, పట్టణ పార్టీ అధ్యక్షుడు వంటెద్దు బాబి, ముషిణి రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఉమన్ చాందీ మృతికి సంతాపం

అమలాపురం టౌన్: మాజీ ముఖ్యమంత్రి, ఏపీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఉమన్ చాందీ మృతిపై నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు బుధవారం సంతాపం తెలిపారు. స్థానిక గడియారం స్తంభం సెంటరులో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు వంటెద్దు బాబి పాల్గొన్నారు.

పది తప్పినా రెగ్యులర్ విద్యార్థులే

- పదో తరగతి ఫెయిలైన విద్యార్థులకు మరో అవకాశం
- మళ్లీ రోజూ పాఠశాలకు హాజరై తరగతులు వినొచ్చు
- అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుకతో సహా సంక్షేమ పథకాలన్నీ వర్తింపు



ఫెయిలైన విద్యార్థినికి అవగాహన కల్పిస్తున్న డీఈఓ కమలకుమారి

అల్లవరం: విద్యా రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. పదో తరగతిలో ఫెయిలైన విద్యార్థులకు మళ్లీ రెగ్యులర్ విద్యార్థులతో పాటు తరగతులకు హాజరై చదువుకునే అవకాశం కల్పించారు. ఉత్తీర్ణత కాలేకపోయిన విద్యార్థులు చదువుకి దూరం కాకుండా చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు రెండు పర్యాయాలు పదో తరగతి చదివి పరీక్ష తప్పినా ప్రస్తుత విద్యా సంవత్సరంలో రెగ్యులర్ విద్యార్థులానే గుర్తించాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది.

గత రెండేళ్లుగా పదో తరగతి తప్పిన విద్యార్థుల వివరాలు(మండలాల వారీగా)

మండలం	పాఠశాలలు	ఫెయిలైన విద్యార్థులు (2021–22)	ఫెయిలైన విద్యార్థులు (2022–23)
అల్లవరం	12	24	97
అమలాపురం	17	82	112
ఉప్పలగుప్తం	7	6	18
ముమ్మిడివరం	6	11	6
ఐ.పోలవరం	8	24	18
కాట్రేనికోన	8	14	21

బాల కార్మికులుగా మారకూడదనే

పదో తరగతి ఫెయిలైన విద్యార్థులు ఇంటి దగ్గరే ఉండి మళ్లీ పరీక్షలు రాసేందుకు సన్నద్ధమవుతుంటారు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో కొందరు తల్లిదండ్రులు ఉత్తీర్ణత సాధించలేని తమ పిల్లల్ని ఏదో పనిలో పెట్టడమో, ఆడపిల్లలైతే పెళ్లి చేసేయడమో చేస్తున్న ఉదాహరణలు కోకొల్లలు. దీనివల్ల ఆయా విద్యార్థులు శాశ్వతంగా చదువుకి దూరమవుతున్నారు. విద్యార్థులంతా ఉన్నత చదువులు అభ్యసించాలన్న సంకల్పంతో ఉన్న ప్రభుత్వం పదో తరగతి ఫెయిలైన విద్యార్థులు తిరిగి రోజూ పాఠశాలకు హాజరై మళ్లీ చదువుకునే అవకాశాన్ని కల్పించింది. రెండేళ్లుగా దండయాత్ర చేస్తున్న విద్యార్థులు సైతం పాఠశాలకు హాజరుకావొచ్చని పేర్కొంది.

సంక్షేమ పథకాల వర్తింపు

రెండోసారి పదో తరగతి చదువుకునే విద్యార్థులకు ప్రస్తుత విద్యా సంవత్సరంలోని విద్యార్థులతో పాటు సంక్షేమ పథకాలన్నీ అందజేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, మధ్యాహ్న భోజనం తదితర సంక్షేమ పథకాలు అందిస్తుంది. దీంతో పదో తరగతి తప్పి ఇంటి వద్దనే ఉంటున్న విద్యార్థులను రోజూ పాఠశాలకు పంపించాల్సిందిగా వారి తల్లిదండ్రులకు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారు. అమలాపురం, ముమ్మిడివరం మండలాల్లో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో గత కొద్దిరోజులుగా దీనికోసం ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తున్నారు. రెండోసారి చదివే విద్యార్థులకు పాఠ్యాంశాలపై ఇప్పటికే అవగాహన ఉండడంతో పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించే అవకాశం సైతం ఉంటుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో పేద విద్యార్థుల పాలిట వరంగా మారింది.

తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం



పదో తరగతి పరీక్షల్లో ఫెయిలై ఇంటి వద్దనే ఉంటున్న విద్యార్థులు మళ్లీ పదో తరగతి చదువుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. పరీక్షల్లో తప్పిన విద్యార్థుల ఇంటికి వెళ్లి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. రెండోసారి పదో తరగతి చదవడం ద్వారా మంచి మార్కులు సాధించొచ్చు.

– కిరణ్‌బాబు, మండల విద్యాశాఖాధికారి, అల్లవరం

చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించండి



ఎంపీ అనురాధకి వినతిపత్రం ఇస్తున్న పద్మినీకుమార్

అల్లవరం: చేనేత ముడిసరకులు నూలు, రంగులు, రసాయనాల ధరలు పెరగడంతో చేనేత కార్మికులకు గిట్టుబాటు కాక తీవ్రంగా నష్టపోతున్నారని బీజేపీ చేనేత సెల్ నాయకులు సోరపల్లి పద్మినీకుమార్ ఎంపీ అనురాధ దృష్టికి తీసుకొచ్చారు. చేనేత సంఘాల నుంచి నిధులు రాక ఆప్కాబ్ నుంచి కొనుగోళ్లు నిలిచిపోయాయని, చేనేత పరిశ్రమ గడ్డు పరిస్థితి ఎదుర్కొంటుందని తెలిపారు. ముడి సరకుల ధరలు తగ్గించేలా ప్రయత్నం చేయాలని విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తూ ఎంపీ అనురాధకి వినతిపత్రం ఇచ్చారు.

నీట్ దరఖాస్తుకు గడువు పెంపు

యానాం: యూజీ నీట్ కోర్సులైన ఎంబీబీఎస్, బీడీఎస్, బీవీఎస్సీ అండ్ ఏహెచ్, బీఏఎంఎస్ తదితర కోర్సుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 20 సాయంత్రం 6 గంటల వరకూ పొడిగించినట్లు పుదుచ్చేరి డైరెక్టరేట్ ఆఫ్ హయ్యర్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో సెంటాక్ కోఆర్డినేటర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు 'సెంటాక్‌పుదుచ్చేరి.ఇన్'ను సందర్శించాలన్నారు.

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



నూతన కార్యవర్గ ప్రతినిధులతో క్లబ్ మాజీ గవర్నర్ భాస్కర్‌రామ్ తదితరులు

అమలాపురం టౌన్: అమలాపురం రోటరీ క్లబ్‌కు నూతనంగా ఏర్పడిన కార్యవర్గం స్థానిక రోటరీ కల్యాణ మండపంలో బుధవారం ప్రమాణ స్వీకారం చేసింది. రోటరీ ప్రతినిధి ఆత్కూరి గిరి అధ్యక్షతన ప్రమాణ స్వీకార సభ జరిగింది. క్లబ్ నూతన అధ్యక్షుడిగా పోలిశెట్టి నాగ భూషణం(నాని), కార్యదర్శిగా శ్రీఖాకోళపు రామసతీష్, కోశాధికారిగా కూచిమంచి శశిధర్ శ్రీరామ్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ ప్రతినిధులతో మాజీ గవర్నర్ భాస్కర్‌రామ్, అసిస్టెంట్ గవర్నర్ శశిధర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. అమలాపురంలో నిర్మించనున్న రోటరీ భవనానికి మాజీ గవర్నర్ భాస్కర్‌రామ్ రూ.5 లక్షలు, అసిస్టెంట్ గవర్నర్ శశిధర్‌రెడ్డి రూ.25 వేలు విరాళంగా ప్రకటించారు. ఓ పేద బాలుడి వైద్యం కోసం క్లబ్ మాజీ గవర్నర్ భాస్కర్‌రామ్ రూ.20 వేలు, రోటరీ క్లబ్ నుంచి రూ.11 వేలు, రోటరీ ప్రతినిధి కూచిమంచి మల్లపరాజు రూ.5 వేలు అందజేశారు. అమలాపురంలో ఏర్పాటుచేయబోయే బ్లడ్ బ్యాంక్‌కు 80 వేల డాలర్లను రోటరీ ఇంటర్నేషనల్ సంస్థ ద్వారా మంజూరు చేయిస్తానని క్లబ్ మాజీ గవర్నర్ భాస్కర్‌రామ్ ప్రకటించారు. కార్యక్రమంలో క్లబ్ మాజీ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్డీఎస్ ప్రసాద్, వరదా మల్లేశ్వరరావు, అడపా ప్రసాద్, వూటుకూరి సుబ్రహ్మణేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఓపెన్ చెస్ టోర్నమెంట్ విజేతగా సాత్విక్



సాత్విక్‌ని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామారావు తదితరులు

అమలాపురం రూరల్: భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో డిప్లొమా రెండో ఏడాది చదువుతున్న ద్రాక్షారపు సాత్విక్ ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన జన నాయక్ డాక్టర్ సీఎస్ఎన్ ట్రోఫీ రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్ విజేతగా నిలిచాడు. టోర్నమెంట్‌లో సాత్విక్ అద్భుతమైన ప్రతిభ కనబరిచి ఏడు రౌండ్లలో 6.50 పాయింట్లు సాధించి గెలుపొందాడు. ఈ సందర్భంగా సాత్విక్‌ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు, డిప్లొమా ప్రిన్సిపాల్ ఫణీంద్ర, ఏవో జక్కం వెంకట కృష్ణారావు, సాత్విక్ శిక్షణ ఇచ్చిన గురువు తాడివెంకట సురేష్‌లు ప్రత్యేకంగా అభినందించారు.

వైద్యులు సమన్వయంతో పనిచేయాలి

- ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకి
- ఉప్పలగుప్తం, ఎస్.యానాంల్లో పీహెచ్‌సీ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాలు



ఉప్పలగుప్తం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జానకి

ఉప్పలగుప్తం: పీహెచ్‌సీల్లో విధులు నిర్వర్తిస్తున్న వైద్యులు సమన్వయంతో పనిచేసి, ప్రజలకు ఇబ్బంది లేకుండా వైద్య సేవలు అందించాలని ఎంపీపీ, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్ దంగేటి వీర అచ్యుత జానకి అన్నారు. బుధవారం మండలంలోని ఎస్.యానాం, ఉప్పలగుప్తం పీహెచ్‌సీల ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాలకు ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆసుపత్రుల్లో రికార్డులను పరిశీలించి వైద్యాధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు అభివృద్ధి పనుల నిమిత్తం తయారుచేసిన అంచనాలను ఎంపీపీ జానకి పరిశీలించి వ్యయాన్ని ఎక్కువగా చూపిస్తున్నారంటూ తీర్మానంపై సంతకం చేయడానికి నిరాకరించారు. వాటిని ఎంపీడీవో, తహసీల్దార్ పూర్తి స్థాయిలో పరిశీలించి తన దృష్టికి తీసుకొస్తేనే ఆమోదిస్తానని తేల్చి చెప్పారు. ఎస్.యానాం పీహెచ్‌సీలో స్థానికంగా ఉన్న వేదాంత, కెయిన్ ఎనర్జీలు ఆసుపత్రికి అందించాల్సిన మందులు రాకపోవడంతో సంబంధిత కంపెనీల యాజమాన్యంతో ఫోన్ ద్వారా చర్చించి మందులొచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉప్పలగుప్తం పీహెచ్‌సీలో సిబ్బంది పనితీరుపై తమకు ఫిర్యాదులు వస్తున్నాయని, వైద్యాధికారుల వ్యవహారశైలి మార్చుకోవాలని హెచ్చరించారు. అనంతరం ఉప్పలగుప్తం ఆసుపత్రిలో మట్టపర్తి ఉమామహేశ్వర సత్యనారాయణ సహకారంతో రూ.70 వేల వ్యయంతో అదనంగా నిర్మించిన రెండు విశ్రాంత గదులను ప్రారంభించారు. ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేసిన సత్యనారాయణను అభినందించారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, తహసీల్దార్ జె.వెంకటేశ్వరి, ఎంపీడీవో కె.ఎస్.గౌరీకుమారి, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు శుభాకాంక్షలు



ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు

అల్లవరం: ఏపీ రాష్ట్ర అసెంబ్లీ ఎస్సీ సంక్షేమ మరియు అభివృద్ధి కమిటీ సభ్యులుగా ఎన్నికైన ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఎంట్రుకోన సర్పంచ్ తిక్కిరెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ని గోడిలోని ఆయన నివాసంలో బుధవారం శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వాసర్ల శ్రీమన్నారాయణ, నార్గన శ్రీను, నవుండ్రు నాగరాజు, వాసర్ల శ్రీను, పాస్టర్ ఏలియా రాజు, విప్పర్తి ప్రసాద్, ఆకుమర్తి ప్రసాద్, జల్లి విజయ్ పాల్గొన్నారు.

వరదల వేళ అన్నీ తానై...





వరదలో ఇంటింటికీ వెళ్లి ఆహార పొట్లాలను అందజేస్తున్న వలంటీర్ గోపాలకృష్ణ

తాళ్లరేవు: గతేడాది జూలై నెలలో సంభవించిన గోదావరి వరదల్లో గ్రామ వలంటీర్ ఎ.గోపాలకృష్ణ అన్నీ తానై గ్రామ ప్రజలకు అండగా నిలిచాడు. పిల్లంక పంచాయతీ పరిధిలోని లంక గ్రామం కొత్తలంకకు చుట్టూ గోదావరి ఉంటుంది. గోదావరికి వరద వచ్చిందంటే చాలు ఈ గ్రామం పూర్తిగా నీట మునుగుతుంది. గతేడాది భారీగా వరద రావడంతో సుమారు 20 రోజుల పాటు గ్రామమంతా ముంపునీటిలో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఆ సమయంలో వరద ముంపులో ఉన్న గ్రామస్తులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వారికి సపర్యలు చేయడంలో గ్రామ వలంటీర్ గోపాలకృష్ణ విశేష సేవలందించాడు. వరదల కారణంగా గ్రామస్తులకు పనుల్లేక, తాగడానికి నీరు, తినడానికి తిండిలేక అనేక అవస్థలు పడ్డారు. ఆ సమయంలో ప్రభుత్వంతో పాటు అనేక స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తలు, దాతృత్వం కలిగిన నాయకులు, వ్యాపారులు రోజుకొకరు చొప్పున ఆహార పదార్థాలను, తాగునీటిని సరఫరా చేసేవారు. ఆయా ఆహార పదార్థాలను వలంటీర్ గోపాలకృష్ణ రోజూ వరద నీటిలోనే బాధితుల ఇళ్లకు చేర్చడంతో పాటు వారికి అవసరమైన సేవలందించి కొండంతా అండగా నిలిచాడు.

వలంటీర్ సాయంతోనే పథకాలు



మా ఇంట్లో మూడు పథకాల లబ్ధి అందుకుంటున్నామంటే దానికి మా వలంటీరే కారణం. వలంటీర్ నాగదేవి సూచనలు, సలహాలతోనే ఆయా పథకాలకు దరఖాస్తులు చేసుకున్నాను. ప్రభుత్వపరంగా ఏ సేవలు పొందాలన్నా వెంటనే మా వలంటీరే గుర్తొస్తారు. మా ఇంటికి నెలలో ఏదో సేవ పేరుతో కనీసం మూడు లేదా నాలుగు సార్లు వస్తుందామె. ఏదైనా అత్యవసరమైతే ఫోన్ చేస్తే వచ్చి సహకారం అందిస్తుంది. నాకు వితంతు పింఛనుతో పాటు ఇంట్లో అమ్మ ఒడి డబ్బులు ఆమె వల్లే అందుకుంటున్నాం. నాకు జగనన్న ఇంటి స్థలం వలంటీర్ చెప్పడం, దరఖాస్తు చేయించడం వల్లే వచ్చింది. కరోనా సమయంలో ఆమె అందించిన సేవలను మా వీధి ప్రజలు ఎప్పటికీ మరిచిపోరు.

– ఆశపు సీతా మహాలక్ష్మి, 16వ వార్డు, అమలాపురం

యూడీసీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- రీజినల్ కోఆర్డినేటర్, ఆర్ఏఓ మునిస్వామి



యానాం: యానాం రీజియన్‌లో ఈ నెల 23న నిర్వహించే అప్పర్ డివిజినల్ క్లర్క్(యూడీసీ) రాత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు పరీక్ష రీజినల్ కోఆర్డినేటర్, ఆర్ఏఓ మునిస్వామి తెలిపారు. బుధవారం ఆయన తన చాంబర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యానాం రీజియన్ నుంచి మొత్తం 2,212 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ జరిగే పరీక్ష కోసం మొత్తం 8 సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. రీజెన్సీ స్కూల్, రీజెన్సీ జూనియర్ కళాశాల, మెట్టకూరు ప్రభుత్వ హైస్కూల్, జవహర్ నవోదయ, ఎంజీజీబీహెచ్ స్కూల్, రాజీవ్ గాంధీ ప్రభుత్వ స్కూల్, ఎస్టీపీపీ జూనియర్ కళాశాల, సాయి జూనియర్ కళాశాల సెంటర్లలో పరీక్ష జరుగుతుందని చెప్పారు. ఆయా సెంటర్లలో జోనల్ ఆఫీసర్లుగా గణేషన్, ఆర్ముగంను నియమించినట్లు తెలిపారు. ఒక్కో సెంటర్‌లో 12 మంది ఇన్విజిలేటర్లు ఉంటారన్నారు. పరీక్ష రోజున విద్యుత్ నిరంతరాయంగా ఉండేలా విద్యుత్ శాఖ, తాగునీరు తదితర ఏర్పాట్లను పీడబ్ల్యూడీ శాఖ చూడాలని ఆదేశించారు. అన్ని సెంటర్ల వద్ద పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం



కందికుప్పలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్



ముమ్మిడివరంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న చైర్మన్ ప్రవీణ్



కోరంగిలో మహిళకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎంపీపీ రాయుడు సునీత



సమనసలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ శ్రీహరి

కాట్రేనికోన: పేదలకు సంక్షేమ ఫలాలు సకాలంలో అందించాలనే ధ్యేయంతో ప్రభుత్వం ఏర్పాటుచేసిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. అవినీతి రహిత పాలనలో భాగస్వాములైన వలంటీర్లపై పవన్‌కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలు అర్థరహితమన్నారు. కందికుప్పలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సంక్షేమ పథకాలకు అర్హత ఉండి సాంకేతిక కారణాలతో దూరమైన లబ్ధిదారులకు జగనన్న సురక్ష కార్యక్రమం సువర్ణ అవకాశమన్నారు. ప్రభుత్వం సీనియర్ సిటిజన్స్‌కు ప్రత్యేక గుర్తింపు ఇస్తూ ఐడెంటిటీ కార్డులను అందజేస్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ముందుగా జమ్మిచెరువులో ఎంపీపీ నిధులు రూ.9 లక్షలు, సీఎస్ఆర్ నిధులు రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. సీఎస్ఆర్ నిధులతో దొంతికుర్రు మర్ల చెరువు, కందికుప్ప శివారు కప్పలవారి పేటల్లో నిర్మించిన వాటర్ ట్యాంకులను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ నేలకిషోర్, సర్పంచ్ చల్లగల వెంకటలక్ష్మి, ఈస్ట్ డెల్టా చైర్మన్ ఏడిది చక్రపాణిరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ కాశి హనుమంతరావు, ఎంపీడీఓ వెంకటచలం, డిప్యూటీ తహసీల్దార్ ఝాన్సీ, పాలెపు ధర్మారావు, ఏడిది సుబ్బు, నల్లా నరసింహమూర్తి, కోటిపల్లి ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: ప్రజా సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష కార్యక్రమం చక్కటి వేదిక అని నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అన్నారు. ముమ్మిడివరం పోలమ్మ చెరువు సచివాలయ పరిధిలో బుధవారం జరిగిన జగనన్న సురక్ష సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ జి.లోవరాజు, బొంతు సత్యశ్రీనివాస్, గణేశుల అరుణ, దొమ్మేటి అప్పారావు, అలీహసన్, గణేశుల బ్రహ్మనందం, కోన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తాళ్లరేవు: పలు సాంకేతిక కారణాలతో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమైన అర్హులకు మేలు చేసేందుకే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తుందని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. బుధవారం కోరంగి పంచాయతీ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం 761 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, సర్పంచ్ పెయ్యల మంగేష్, తహసీల్దార్ ఎస్.పోతురాజు, ఈఓపీఆర్డీ మల్లాడి భైరవమూర్తి, పంచాయతీ కార్యదర్శి రామరాజు, ఎంపీటీసీ సభ్యులు పోతుల రత్నకుమారి, పాలెపు పోసియ్య, రాయుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: మండలంలోని సమనసలో సచివాలయం వద్ద బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్ గోపాల్, సర్పంచ్ పరమట శ్యామ్‌లు లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జె.వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ మామిళ్లపల్లి దొరబాబు, కోఆప్షన్ సభ్యుడు ముసలి స్వర్ణన్‌రాజు, ఎంపీటీసీ ఊడుం రామకృష్ణ, మామిళ్లపల్లి ఫణికుమార్, నాని తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

యానాం: పుదుచ్చేరి స్త్రీశిశు సంక్షేమ శాఖలో మహిళా సాధికారిత డిస్ట్రిక్ట్ హబ్‌లో పనిచేయడం కోసం వివిధ పోస్టుల భర్తీకి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ ముత్తుమీనా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో మిషన్ కోఆర్డినేటర్‌లు, జెండర్ స్పెషలిస్ట్, రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ స్పెషలిస్ట్, అకౌంట్స్ అసిస్టెంట్, ఆఫీసు అసిస్టెంట్ తదితర పోస్టులను భర్తీ చేయనున్నామన్నారు. ఈ పోస్టులకు పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్ రీజియన్‌వారు అర్హులన్నారు. ఆగస్టు 5 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు.

ఘనంగా మరిడమ్మ జాతర మహోత్సవాలు

ముమ్మిడివరం: ఏడు సంవత్సరాల.. ఏడు నెలల.. ఏడు రోజులకు ఒకసారి వచ్చే తానేల్లంక శివారు వడ్డిగూడెం శ్రీమరిడమ్మ తల్లి జాతర మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. గత ఐదు నెలలుగా 12 గ్రామాల్లో అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు. చివరిగా వడ్డిగూడెంలో బుధవారం జాతర జరిగింది. గురువారం బాజా భజంత్రీలు, గరగ నృత్యాలు, బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారి ఊరేగింపు నిర్వహించనున్నారు. అనంతరం భారీ అన్నసమారాధన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

శోక సంద్రంలో షియా ముస్లింలు

అమలాపురం టౌన్: అమలాపురంలోని షియా ముస్లింలు తమ ఆరాధ్య దైవం మహమ్మద్ ప్రవక్త మనవడైన ఇమామ్ హుస్సేన్‌ను దాయాదులు హింసించిన ఘటనపై శోక తప్త హృదయాలతో విలపించారు. బుధవారం స్థానిక 12వ వార్డులోని అబ్బాస్యా పంజా వద్దకు వందల సంఖ్యలో షియా ముస్లింలు చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. పంజాలోని ప్రత్యేక అలంకరణలో ఉన్న ఇమామ్ హుస్సేన్ పీరుకు ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మసీదు అధ్యక్షుడు నిసార్ హుస్సేన్, కార్యదర్శి కర్రార్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుకు సహకరించాలి

యానాం: స్థానిక నియోజకవర్గ పరిధిలో ఈ నెల 21 నుంచి వచ్చే నెల 21 వరకూ నిర్వహించే ప్రత్యేక ఓటర్ల నమోదు ప్రక్రియకు ప్రజలు సహకరించాలని ఆర్ఏఓ మునిస్వామి కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని 33 పోలింగ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్లు(బీఎల్ఓ) ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తారన్నారు. సర్వేలో ఆయా కుటుంబాల్లోని ఎంతమంది ఓటర్లున్నారు, యానాం నుంచి ఇతర రాష్ట్రాలకు, ప్రాంతాలకు వెళ్లినవారు ఎంతమంది ఉన్నారు, మృతులు తదితర వివరాలను సేకరిస్తారన్నారు. ప్రజలంతా బీఎల్ఓలు అడిగిన సమాచారాన్ని ఇచ్చి సహకరించాలని కోరారు.

భూములు కౌలు హక్కు బహిరంగ వేలం ప్రకటన

[illegible] ... 22-07-2023 ... [illegible]

సం/- కె.గంగాధర్
[illegible]